# దౌష్ట్యం

సి.సుజాత

**"ఇంకో గంటలో తేలిపోతుంది ఆడో నేనో...నేను పోయినా దిగుల్లేదు కానీ, ఆడు వస్తే కుదర్దు మాణిక్యం. అవునూ, అడగటం మరిసేపోయా, ఇళ్ళం పెళ్ళాం వచ్చినట్టుందిగా."**

"ఆఁ వచ్చింది. ఆళ్ళైనకెడితో పోయి, ఓటేసింది. పైగా నన్ను పలకరింపు. 'ఏవన్నా బాగున్నావా?' అని! ఏవంటా, బుర్రవూపి ఇటొచ్చా!"

"ఎంత దయిర్యం మనిషికి, మనం అక్కడికి గాజు లేసుక్కూచ్చున్నాం అనుకొంటదా ఏంటి! సూస్తా ఎటూ గంటలో తేలిపోయిద్ది కదా. ఏడ సాకు దొరికిద్దా అని సూస్తున్నా. ఇది మాస్టర్ ప్లానే. దొరికిపోయింది. నేనే రాకపోవాలా ఆణ్ణే సాయంకాలానికి ఏసెయ్యాల. మనం ఆలోసనలో వుండగానే ఈవిడ తిప్పకుంటూ పోతావుంది. దొరికావు గదే ... అని కాస్త స్థిమితం చిక్కింది." "ఒక ఓటుతో మనకేంటి. ఆ సుజనమ్మ ఓటు లేందే నీ సీటు పోయిద్దని బెంగా."

మస్తానమ్మ మూతి విరుచుకొంది. వళ్ళు మండి కోపంగా వుంది ఆమెకు. ఏ విధంగానూ సుజనతో పోలిక లేదు. అయినా ఏదో కసి. సాటి ఆడది సుఖంగా హాయిగా బ్రతుకుతుంటే ఓర్వలేనితనం. ఏరుకొనే బియ్యం చేట అవతలికి నెట్టి ఉత్సాహంగా వినటం మొదలెట్టింది ఆమె.

ఇండియా మేప్‌లో వెతికినా దొరకని కుగ్రామం అది. ప్రపంచం అన్నివిధాలా అభివృద్ధితో ముందుకు పోతున్నది. పాత తరాన్ని పట్టుకువేళాడే చీకటి కోణం. పంచాయితి ఎన్నికల పుణ్యమా అని, రాబోయే మండల ఎన్నికల కోసం రంగం సిద్ధం చేస్తూ రాజకీయ అతిరథ మహారథులు పలవన్నిన వేళ అది. అందుకే ఆ నిర్జీవ గ్రామానికి జీవకళ.

"ఇంతకుముందే ఫోను కొట్టాడురా ఐద్రాబాద్ నుంచి. ఎన్ని తగూలైనా సరే తలకాయలు పగిలినా సరే ఎనకాడద్దని. మీకెందుకు నేజాసుకొంటా. రేత్రికే లారీ వస్తాదంట. మనగ్గావలసినంత సామ్రగి. ఇంకేం బయ్యం."

"అడుక్కు తిన్నట్టై వుంది. ఆయనకేం పోన్లు, పెర్మిగాములు కొడతాడు. కొట్టుకుసచ్చేది మీరు." మస్తానమ్మకి సుజనమ్మ పతన మీద మోజు పోయింది. భర్తగారి కాళ్ళు చేతుల భద్రత గుర్తు వచ్చింది.

"అందుకే ఆడాళ్ళు మాటాడద్దంటా. నోరు మూసుకొని లోనకెళ్ళు. సెప్పొచ్చింది... నాకు దెలియదు. అహా నాకు తెలియదా అంట. నువు లేయి, ఆ సుజనమ్మ ఊరికెళ్ళద్దేమో సూడు. రేతిరికి బయలుదేర్తారు ఆళ్ళు."

"ఆళ్ళు ఊరికిపోతే నీకేం!? అమ్మో, ఆవిని కదిలిచ్చే పస ఎవడికుంది. నాలుగు అచ్చరాలు వచ్చని ఎంత గీర్వాణం."

మాణిక్యానికి నవ్వు వచ్చింది.


"నే జెప్తా ఇను. దీనికి పొట్ట పొడిస్తే అక్షర ముక్క రాదు.

ఆవె దర్జాగా వుంటుంది. ఈవి పిడకలు కొడుతుంది. ఇంక జాలా. పోరా సోంబేరీ. ఆడదానితో మాటలెందుకు." కాబోయే ప్రెసిడెంటు, మస్తానమ్మకి మొగుడు, నూకరాజు సెలవిచ్చాడు చిద్విలాసంగా.

మాణిక్యం నోరు విప్పేలోపే

"మామా, మనం కొండిక్కేం..."

నూకరాజు మేనల్లుడు ...బాబు ...



వచ్చేదు.

"ఎంతంట మెజార్టీ"

"యాభై"

"ఓర్నీ... అడికి సమస్యే లేకుండా మూడింది. మస్తానా, పోయి సుజనమ్మ సామాన్లు సర్దుతా వుందేమో సూడు పో..."

మాకరాజు లేచి నిలబడ్డాడు. వళ్ళు మండే కోపంతో ఒక్క కేక పెట్టాడు.

"మాణిక్యెం, మనోళ్ళందర్నీ రెడీ గుండమను. ఇది నాకు ముందే తెల్సు. పోయి సుజనమ్మ ఇంటిమీద పడండి."

మాణిక్యానికి విషయం అర్థం కాలేదు.

"ఆళ్ళెందుకు మామా! ఆళ్ళేం చేశారు. పాపం, ఆ కొంప అసలే కూలిపోతే. ఉన్నవూరు, పొలాలు వదిలి పెట్టుకొని పొట్ట చేత్తో పట్టుకొని మొగుడూ పెళ్ళాలు ఊరొదిలిపోతే..."

"ఓరి పిచ్చి సన్నాసి పోరా. ఇక్కడ పాపం పుణ్యం లేదు. పని జరగాల. ఆళ్ళ కొంపన బడితే, అవతల లాళ్ళు క్రరలు తెస్తారు. మన పని మనం కానిద్దాం..."

అయోమయంగా నిలబడ్డ మస్తానమ్మకు విషయం అర్థం అయింది. మొహం వికసించింది. సుజనమ్మ కట్టుకొనే చీరలు, ఇండ్ల సామాన్లు, పిల్లల ఆట వస్తువులు వరసగా గుర్తుకొచ్చాయి ఆమెకు.

"నిన్ను తగలెయ్య. పోయి, ఆ మాలచ్చిమిని, ఆళ్ళ అక్కని రమ్మను పో. ఆ ఇద్దరినీ ఇరికిద్దాం..."

మస్తానమ్మకి భర్త మీద ప్రేమ ముంచుకొచ్చింది అతని తెలివితేటలకు. మాలక్ష్మి, ఆవిడ అక్క ఇద్దరూ దిక్కులేని విధవలు. కాస్తోకూస్తో ఆస్తిపాస్తులు ఉన్న వాళ్ళు. వాళ్ళు ఎలా దెబ్బతిన్నా అడిగేవాళ్ళు లేరు. మిగతావాళ్ళు అంతా తెలివితక్కువగా ఇరుక్కో రు. ఆళ్ళిద్దరే కాస్త తొందరపడే మనుషులు. మస్తానమ్మ వయసు సంగతి కూడా మర్చిపోయి, చిన్న పిల్లలా పరుగు తీసింది మాలక్ష్మి ఇంటికి. మాణిక్యానికి హటాత్తుగా దిగులు ముంచుకువచ్చింది జరగబోయేది తలచుకొని- ఎంతమంది అమాయకులు మునిగిపోతారా అని.

* * *

"సుజనక్కా! ఇక ఇక్కడికి రావట్లేనా?" పద్మ ఎప్పటినుంచో ఇదే ప్రశ్న అడుగుతూనే వుంది.

"ఎందుకు రానూ! నాకు మాత్రం సరదానా మిమ్మల్నందరినీ వదిలేసి దిక్కు లేకుండా ఎక్కడో పట్నంలో పడివుండటానికి. ఈ పంటలు దెబ్బతినీ, బతుకుతెరువు లేకా గానీ, నాకేం ఆనందం. ఇంతంత ఇళ్ళు అక్కడ ఉంటాయా! ఏదో పొట్ట తిప్పలు..."

సుజన కళ్ళు తుడుచుకుంది. అక్కడ చేరిన ఆడ పిల్లలు అందరూ ఏడ్చేయడం మొదలుపెట్టేరు. సుజన ఆ వూళ్ళో అడుగుపెట్టేసరికి పదహారేళ్ళ అమ్మాయి. ఇన్నేళ్ళుగా ఆ వూరితో అనుబంధం పెంచుకొంటూ వస్తోంది. ప్రైవేటుగా ఎం.ఎ. చేసింది ఆ ఇంట్లోనే. వయోజన విద్యా కేంద్రం నడిపింది ఆ ఇంట్లోనే. ఆ ఆడపిల్లలకు ఆవిడ ప్రాణాధికం. పంటలు సరిగా పండక, అప్పులలో మునిగిపోయి, ఆమె అతిదీనంగా ఆ వూరు వదలటం సహించలేకపోతున్నారు వాళ్ళు.

"పిచ్చి పిల్లల్లారా! ఏడుస్తారా?! ఇటు చూడండి, నేనేం దేశం విడిచిపెట్టేనా? పక్క వూర్లో ఉద్యోగం. మీ బావ య్యకీ ఉద్యోగం వచ్చింది. ఇద్దరం చెరి కాస్త డబ్బు సంపాయిస్తాం. పిల్లలు, చదువులు ఇవన్నీ ఎలా చెప్పండి! ఎప్పటికో మంచిరోజులు వస్తాయి. మళ్ళీ అందరం కలుద్దాం" సుజనమ్మ రాని నవ్వు పెదవుల వరకు తెచ్చుకొంది.

"అక్కా మాణిక్యాలరావక్కా! మాకరాజుగారి చుట్టాలాయన పిలుస్తున్నాడు."

సుజన కళ్ళు తుడుచుకొని బయటకు వచ్చింది.

"రండి అన్నగారూ, కూర్చోండి. ఆయన లారీ తీసుకువస్తానని వెళ్ళేరు. ఏదన్నా పని వుందా?"

సుజన మొహంలోకి చూచేందుకు మాణిక్యాల రావుకు సిగ్గుగా వుంది. ఇంకాసేపట్లో ఈ ఇల్లు, ఈ ఇల్లాలు ఏమవుతారు! ఈ రాజకీయాలకు, ఈ శిథిలమైన ఇల్లు మరింత కూలిపోతుంది. అయినా తప్పదు. వీళ్ళని లాగకపోతే మిగతా జనం బయటకు రారు.

"ఊరిడిసిపోతున్నారా ఏందీ, ఎట్ట కుదురుద్దీ, ఆ ముసిలి ముండలు గోలపెడుతున్నారే బయట!"

"ఎవరూ గొడవ పెట్టేది—" సుజన ఆశ్చర్యంగా బయటకు వచ్చింది. బయటంతా జనం. జనం మధ్యలో ఏడుస్తూ మొత్తుకుంటూ మాలక్ష్మి.

"నా బాకీ సంగతి అడగండి నాయన్లారా! నేను అన్నేయం అయిపోతానో దేవుడా! ఈళ్ళు ఊరిడిసి పోతే, నేనేం జేసేది తండిరీ..."

సుజన నిర్ఘాంతపోయింది. 'ఏమయింది వాళ్ళకు? బాకీ వుంటే ఏమవుతుంది. దానికి సరిపడా బంగారం వాళ్ళ దగ్గరే వుంది, తాకట్టు పేరుతో. కొత్తగా గొడవేమిటి?'

"ఆళ్ళ సంగతి తేల్చిపో. నీ మొగుణ్ణి బయటకు రమ్మను."

జనంలోంచి ఓ కేక.

సుజన ఓపిక లేనట్లు ద్వారబంధానికి చేరబడింది. ఈ ఇంట్లో, వీథిలో, హుందాగా తిరిగే భర్త విశ్వం గుర్తు కొచ్చేడామెకు.

"రమ్మను, వాడ్ని బయటికి."

పది గొంతులు పిలిచేయి.

"ఆయన లేడు"— అని చెప్పాలని ప్రయత్నం చేసింది సుజన. దుఃఖం కెరటంలా ఆమెను ముంచెత్తుతూ మాట రానీయలేదు. అలాగే క్రిందకు జారి పోయిందామె. ఆమెను దాటిపోతూ ఎన్నో కాళ్ళు... ఆ ఇల్లు అరగంటలో ఖాళీ అయింది.

"అమ్మా, ఓ సారి లేవవూ! ఆ సీను నా పెన్ను తీసుకున్నాడే. నా పుస్తకాలు లాక్కున్నాడే. అమ్మా, లేవ్వూ" పిల్లలిద్దరూ తల్లిని తట్టి పిలుస్తున్నారు.

విశ్వం వాకిట్లోకి రాగానే కనపడిన దృశ్యం అదే. ఎన్నేళ్ళుగా, ఎన్నాళ్ళుగా సమకూర్చుకున్న సామాను ఏదీ లేదా ఇంట్లో, నేలంతా దుమ్మూ ధూళి తప్పించి. అచేతనంగా పడివున్న సుజన. ఆమెను చూసి ఏడ్చే పిల్లలు. విశ్వానికి మనసారా ఏడ్చి బాధ తీర్చుకోవాలని పించింది. తెరిచి వుంచిన తలుపుల్లోంచి దూరంగా కనబడుతోంది జనాలు చేసే సందడంతా.

"విశ్వం ఇంట్లో దూరేందుకు మీకెన్ని గుండెలురా రండి తేల్చుకుందాం."

"మీ కోసమే కాచుకున్నాం. రండిరా చూపిస్తాం మేమంటే ఏమిటో..."

అక్కడ తలకాయలు పగలవచ్చు, లేదా కొందరు మనుషులే మాయం అవచ్చు. అది రాజకీయ సమరం.

"ఇలా ఎందుకయిందండీ?"

సుజన ఏడుస్తోంది. ఇంట్లో పూచిక పుల్ల లేదు పుట్టెడు అవమానం తప్ప. కట్టుకొనే దుస్తులు కూడా ఎత్తుకుపోయారు. ఎందుకో చెప్పగలిగిన మాకరాజు వాళ్ళ ఇంట్లో భద్రంగా వున్నాడు మస్తానమ్మ దోచుకు వచ్చిన సామాన్లు చూచి సంతోషిస్తూ—

"నీకియ్యన్ని ఫలానాచోట వుంటయ్యని ఎలా తెలుసే మస్తానా?"

"రోజూ చూస్తాంగదా... దరిద్రం ఇప్పుడొచ్చింది కానీ, ఇంతకుముందు బాగా బతికిన కొంప కదా. సామాను బాగానే వుంది. ఇంక ఆమెను బడాయిగా నవ్వమను సూద్దాం. ఎట్ట నవ్వుద్దో. బయట గోల ఏమయితేనేం గానీ, ఇంటెడు సామాను దొరికింది" మస్తానమ్మ నవ్వుతోంది, రూపెత్తిన స్వార్థం లాగ. బయట ఇంకా తలకాయలు బద్దలవుతూనే వున్నాయి. జనం వీరావేశంతో అరుచుకుంటూనే వున్నారు. పోలీసులు, చట్టం, న్యాయం, ఇవన్నీ వాళ్ళని భయపెట్ట లేవు. వాళ్ళ వెనక, కులం, రాజకీయం, అండగా, బలంగా ఆ మానవారణ్యంలో దిక్కులు చూసే లేడి పిల్లల్లా విశ్వం, సుజన.

### లెక్క

సుబ్బారావు కాళ్ళకి, చేతులకి కట్లతో గంట ఆలస్యంగా ఆఫీసుకి వచ్చాడు.
బాస్: "ఇప్పుడు తొమ్మిదిన్నర అయింది. నువ్వు గంట లేటు తెలుసా?"
సుబ్బారావు: "సారీ సర్. పొద్దున్నే మా అపార్ట్ మెంట్ అయిదో అంతస్తునుంచి కిందపడ్డాను"
బాస్: "కిందపడడానికి గంట సేపు పట్టిందా?"
సుబ్బారావు: — ?

